వేయించు టీకా.. ఇక ఉండదు ధోకా



పట్టణంలోని అంబేడ్కర్ నగర్‌లో గాలికుంటు టీకా వేస్తున్న పశువైద్య సిబ్బంది

- పశువులకు ఉచితంగా గాలికుంటు టీకా
- సెప్టెంబర్ 18 వరకు ప్రత్యేక కార్యక్రమం
- పశువుల సంరక్షణపై పశు సంవర్ధక శాఖ ప్రత్యేక దృష్టి

సత్తెనపల్లి: వ్యవసాయాధారిత ప్రాంతం మనది. దానికి అనుబంధంగా పాడిపరిశ్రమ రైతుకు ఆర్థిక దన్నునిస్తుంది. అయితే పశువులకు తరుచుగా వచ్చే వ్యాధులు యజమానులకు నష్టం కలుగజేస్తాయి. ముఖ్యంగా గేదెలు, ఆవులు, ఎడ్లు వ్యాధులతో మృత్యువాత పడితే ఆ ప్రభావం ఎక్కువగా ఉంటుంది. ఇలాంటి క్రమంలో ప్రభుత్వం నిర్వహించే కార్యక్రమాలను తెలుసుకుని పశువుల యజమానులు, రైతులు సద్వినియోగం చేసుకోవాలి. పశువుల్లో అనేక వ్యాధులు విజృంభిస్తున్న నేపథ్యంలో నివారణకు పశుసంవర్ధక శాఖ ప్రత్యేక ప్రణాళిక రూపొందించింది. ఈ నెల 20 నుంచి సెప్టెంబర్ 18 వ తేదీ వరకు జాతీయ పశు వ్యాధి నియంత్రణ పథకం కింద గాలికుంటు నివారణకు గ్రామాల్లో ఉన్న ప్రతి పశువుకు ప్రభుత్వం టీకా వేస్తోంది.

వ్యాప్తి ఇలా..

వైరస్ వల్ల వచ్చే తీవ్రమైన అంటు వ్యాధి గాలికుంటు. ఈ వ్యాధి కలిగించే వైరస్‌లో ఓఏసీ, ఆసియా-1, సాట్-1, సాట్-2, సాట్ -3 రకాలు ఉన్నాయి. గాలి ద్వారా వ్యాపించే ఈ వ్యాధి దేశవాళి కంటే సంకర జాతి పశువుల్లో ఎక్కువ నష్టం కలగజేస్తుంది. గాలికుంటు వ్యాధి బారిన పడిన పాడి పశువు పాలు తాగితే దూడలు మృత్యువాత పడతాయి. ఈ వ్యాధి కలిగించే వైరస్ క్రిములు పశువుల పేడ, పారుడు, పొంగు, వీర్యం, పాలు, పుండ్లు ద్వారా విసర్జింపబడి.. నీరు, గాలి, మేత ద్వారా వ్యాప్తి చెందుతాయి.

గాలికుంటు టీకా వేయించాలి



పశువుల్లో గాలికుంటు వ్యాధి నివారణకు ప్రభుత్వం ప్రత్యేక టీకా కార్యక్రమం చేపట్టింది. పాడి రైతులు తమ గేదెలకు, ఆవులకు, ఎడ్లకు తప్పకుండా స్థానిక పశు వైద్యశాలలకు తీసుకెళ్లి టీకా వేయించాలి. గాలికుంటు రాకుండా ముందస్తుగా ఎంతో ఉపయోగపడుతుంది. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

–డాక్టర్ ఎం.శ్రీనివాసరావు, ఏడీ, పశుసంవర్ధక శాఖ సత్తెనపల్లి

పశువులకు గాలికుంటు టీకా

క్రోసూరు: మండలంలోని నాగవరం, క్రోసూరు గ్రామాల్లో పశుసంవర్ధ శాఖ ఆధ్వర్యంలో గురువారం 400 పశువులకు గాలికుంటు వ్యాధి టీకా వేసినట్లు మండల పశు వైద్యుడు డాక్టర్ మల్లయ్య తెలిపారు. లేగ దూడలకు బ్రూసెల్లా వ్యాక్సినేషన్ చేపట్టినట్లు చెప్పారు. సెప్టెంబర్ 18 వరకు వాక్సినేషన్ కార్యక్రమం ఉంటుందని, పశు పోషకులు ఈ అవకాశాన్ని సద్వినియోగపరుచుకోవాలని కోరారు.

వ్యాధి లక్షణాలు..


- 2 నుంచి 6 రోజుల్లో వ్యాధికి గురయ్యే శాతం ఒకటి నుంచి రెండు శాతం ఉంటుంది.
- జ్వరం 104 నుంచి 106 డిగ్రీలు ఫారన్ హీట్ ఉంటుంది.
- పశువు మేత మేయదు, నెమరువేయదు, నోటిలో బొబ్బలు పగిలి చొంగ కారుతుంటుంది.
- కాలి గిట్టల మధ్య బొబ్బలు ఏర్పడి పుండ్లుగా మారి, పశువులు కుంటుతూ నడుస్తాయి.
- పొదుగుపై బొబ్బలు ఏర్పడి, వాపు వస్తుంది.
- పశువులు గర్భధారణ శక్తి కోల్పోతాయి.
- మేకలు గొర్రెలు, పందుల్లోనూ గాలికుంటు వ్యాధి వస్తుంది.

నివారణ చర్యలు..

- వ్యాధి సోకిన పశువులను మంద నుంచి వేరు చేయాలి.
- ఐదు శాతం క్రెసాలను నీటిలో కలిపి పశువుల పాకకు కడిగితే వైరస్ నశిస్తుంది.
- పక్క గ్రామాల్లో వ్యాధి ఉన్నప్పుడు పశువులను సంతలకు, జాతర్లకు వెళ్లనివ్వకూడదు.
- గాలికుంటు వ్యాధి నిరోధక టీకా రెండు నెలల్లోనే దూడకు వేయించాలి. బూస్టర్ డోస్ నెల తర్వాత, ఏటా క్రమం తప్పకుండా వేయించాలి.
- పాడి పశువులకు ఈ నెల తర్వాత టీకా వేయించాలి.
- కలుషితమైన పశువుల దాణా, మేతను కాల్చివేయాలి
- వ్యాధి లక్షణాలున్న ఆంబోతులు, దున్నలను సంపర్గానికి వినియోగించరాదు
- పాలను బాగా వేడి చేసిన తర్వాత తాగడానికి వినియోగించాలి.
- పశువు చనిపతే కళేబరాన్ని లోతైన గొయ్యి తీసి, సున్నం వేసి పాతి పెట్టాలి. లేదా కాల్చేయాలి.

చి'వరి'కి కష్టమే

- కాలువలకు సాగర్ నీళ్లు కొద్ది మొత్తంలో విడుదల
- ఆయకట్టు చివరి భూములకు సాగునీటి సరఫరా కష్టమే..
- కంపచెట్లతో నిండుకుపోయిన కాల్వలు
- డివిజన్‌లో ఆయకట్టు విస్తీర్ణం 45,481 ఎకరాల సాగు ప్రశ్నార్థకం



ఎర్రబాలెం మేజర్ కాలువ ఇలా..



చింతపల్లి మేజర్ కాల్వలో నీటి పారుదల



కస్తల మైనర్ కాలువ దుస్థితి

క్రోసూరు: అంగట్లో అన్నీ ఉన్నా అల్లుడు నోట్లో శని అన్నట్లు తయారైంది రైతన్న పరిస్థితి. ఈ ఏడాది వర్షాలు ఆలస్యంగా పడినా ప్రాజెక్టులు నిండటంతో ప్రభుత్వం నాగార్జున సాగర్ కాలువలకు నీళ్ల విడుదల చేసింది. అయినా పెదకూరపాడు నియోజకవర్గంలోని సాగర్ ఆయకట్టు రైతులకు పూర్తి స్థాయిలో నీళ్లు అందలేదు. సాగర్ డ్యామ్ వద్ద మరమ్మతులు కారణంగా పూర్తి స్థాయిలో నీటి విడుదల చేయకపోవడం, దీనికితోడు ఆయకట్టు కాల్వల మరమ్మతులకు నోచుకోకపోవడంతో రైతులకు నీటి లభ్యత కష్టతరంగా మారింది. అసలు చివరి భూములకు ఏమాత్రం నీళ్లు చేరని పరిస్థితి నెలకొంది. సాగర్ కుడి కాలువ ప్రాజెక్ట్ సబ్ డివిజన్ పరిధిలోని అచ్చంపేట, బెల్లంకొండ, అమరావతి, క్రోసూరు మండలాల కింద ఆయకట్టు మొత్తం 45,481 ఎకరాలుంది.

మేజరు కాల్వలు ఇలా..

ఆయకట్టుకు బెల్లంకొండ బ్రాంచి కెనాల్, ఎర్రబాలెం మేజర్ కాల్వలు, క్రోసూరు, అచ్చంపేట చింతపల్లి మేజర్ కాల్వల ద్వారా నీళ్లు విడుదల చేస్తారు. కాలువ నీళ్లపై ఆధారపడిన ఆయకట్టు వరి రైతులకు నీటి కష్టాలు ఎదుర్కోవాల్సి పరిస్థితులు నెలకొన్నాయి. అయితే చెరువుల కింద సాగు చేస్తున్న వరి రైతుల పరిస్థితి భిన్నంగా ఉంది. చెరువులు జలకళ సంతరించుకోవడంతో.. వరి పైరు పుష్కలంగా రైతులు సాగు చేస్తున్నారు.

పారుదల కష్టమే..

మేజర్, మైనర్ కాల్వలన్నీ.. పిచ్చి మొక్కలు, కంప చెట్లతో నిండిపోయి ఉన్నాయి. కిందకు నీటిని విడుదల చేసినప్పటికీ చిరవరి ఆయకట్టుకు చేరని పరిస్థితి నెలకొంది. దీంతో చివరి భూముల రైతులకు ఇబ్బందులు తప్పేలా లేవు.

మరమ్మతులు..తప్పని కష్టాలు

ప్రస్తుతం ఈ ఏడాది సాగర్ ప్రాజెక్టు వద్ద మరమ్మతులు దృష్టా నీటిని తక్కువగా విడుదల చేస్తున్నట్లు క్రోసూరు కెనాల్స్ ఏఈ ఇబ్రహీం తెలిపారు. మరి కొద్ది రోజుల్లో పూర్తి స్థాయిలో నీటిని విడుదల చేస్తారని చెప్పారు. కాలువలు శుభ్రం చేసేందుకు అంచాలు పూర్తిచేసామని తెలిపారు. ప్రభుత్వం ఆదేశిస్తే కాలువల్లో పిచ్చి మొక్కలు, కంప తొలిగించేందుకు అవకాశం ఉంటుందన్నారు.

సబ్ డివిజన్ ఆయకట్టు భూముల వివరాలు

మండలం	మాగాణి	మెట్ట	మొత్తం
బెల్లంకొండ	1,149	3,212	4,361
క్రోసూరు	7,497	11,784	19,281
అచ్చంపేట	5,883	15,130	21,013
అమరావతి	775	51	826
మొత్తం	15,304	30,177	45,481



కళకళలాడుతున్న క్రోసూరు చెరువు కింద వరి పైరు

క్లుప్తంగా

అంగన్‌వాడీ సేవలపై అవగాహన



పెదకూరపాడు: పెదకూరపాడులో అంగన్‌వాడీ-2 సెంటర్‌లో 100 రోజులు ప్రణాళికలో భాగంగా అంగన్‌వాడీల్లో అందిస్తున్న సేవలు, బాల్య వివాహాలు, బాలికల అక్రమ రవాణ నివారణపై తల్లులకు అవగాహన కార్యక్రమం గురువారం నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్త గోగులపాటి కుమారి అధ్యక్షత వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షేక్ మున్ని, విశ్రాంత సూపర్ వైజర్ షేక్ చావా నిర్మల మేరి పాల్గొని, మాట్లాడారు. మూడేళ్ల లోపు చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపితే వారికి ఆటపాటలతో కూడిన విద్య, పౌష్టికాహారం అందిస్తారన్నారు. 18 సంవత్సరాలు నిండిన బాలికల సంరక్షణకు తీసుకోవాల్సిన చర్యలను తల్లులకు వివరించారు. అనంతరం గర్భిణులకు సీమంతం, చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రాజు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి గ్రామ సభలు

నకరికల్లు: గ్రామాల్లో అభివృద్ధి పనుల ఆమోదం కోసం ఈ నెల 23 నుంచి గ్రామ సభలు నిర్వహించున్నట్లు ఎంపీడీఓ బండి శ్రీనివాసరెడ్డి గురువారం తెలిపారు. వేతనాల పొందేవారి హక్కులు, అర్హతలపై అవగాహన, ఇప్పటికే మంజూరు చేయబడిన, పురోగతిలో ఉన్న పనులు చదవడం, 2024-25లో చేపట్టాల్సిన కొత్త పనులు గుర్తించి, ఆమోదం కోసం గ్రామ సభలో తెలియపరచడం జరుగుతుందన్నారు. సామాజిక తనిఖీ ప్రాముఖ్యతపై అవగాహన కల్పించడం లాంటి అంశాలపై సభలు నిర్వహిస్తామన్నారు. ఇప్పటికే ఆయా గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించేందుకు ఇన్‌చార్జిలను నియమించామన్నారు. గ్రామ సభల నిర్వహణపై పంచాయతీ కార్యదర్శులు ముమ్మర ప్రచారం చేసి, విజయవంతం చేయాలని కోరారు.

బెల్లంకొండ: మండలంలోని అన్ని గ్రామాలలో శుక్రవారం తలపెట్టిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం గ్రామ సభలను విజయవంతం చేయాలని ఎంపీడీఓ బి.వెంకటరెడ్డి తెలిపారు. గురువారం స్థానిక కార్యాయంలో ఆయన మాట్లాడుతూ అన్నీ గ్రామాల్లో నూతన పనులను గుర్తించేందుకు ప్రభుత్వ ఆదేశాల మేరకు సభలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

అచ్చంపేట: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా 2024-25 ఆర్థిక సంవత్సంలో చేపట్టబోయే పనులపై మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో శుక్రవారం సర్పంచ్‌ల అధ్యక్షతను గ్రామ సభలు నిర్వహించాలని ఎంపీడీవో శివ సుబ్రమణ్యం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని 23 గ్రామ పంచాయతీల్లో తప్పనిసరిగా గ్రామసభలు నిర్వహించాలని పేర్కొన్నారు. ఇందుకోసం మండల స్థాయి అధికారులను నియమించినట్లు తెలిపారు.

పాడి రైతులకు బోనస్ పంపిణీ



పెదకూరపాడు: పాడి రైతుల సంక్షేమమే లక్ష్యంగా సంగం డెయిరీ పని చేస్తుందని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. పెదకూరపాడులో 200 మంది పాడి రైతులకు రూ.6,04,000లు బోనస్‌లను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు డెయిరీ పాలకవర్గ సభ్యుడు వలివేటి ధర్మరావు అధ్యక్షత వహించారు. పశు గ్రాసం కోసం రూ.12వేల నగదు, ఇన్సూరెన్సు, గడ్డి విత్తనాలు అందిస్తున్నట్లు ఎమ్మెల్యే ప్రవీణ్ తెలిపారు. పాడి రైతులకు వీరయ్య చౌదరి పశు వైద్యశాలలో 50 శాతం సబ్సిడీపై వైద్య సేవలు కూడా అందిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గుడిపూడి రాజు, టీడీపీ మండలాధ్యక్షుడు ఆర్తిమళ్ల రమేష్, డెయిరీ అధ్యక్షుడు గుండప నేని బాష, వైఎస్ ఎంపీపీ షేక్ బాష, మాజీ ఎంపీపీ గల్లా బాబురావు, మహిళ నాయకురాలు షేక్ ముంతాజ్ ఉన్నారు.

టీవీ బహూకరణ



పెదకూపాడు: మండల కేంద్రంలోని అంగన్‌వాడీ-2 సెంటర్‌కు మాజీ కానిస్టేబుల్ గుడిపూడి భాస్కరరావు జ్ఞాపకార్థం అతని కుటుంబ సభ్యులు వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు, కీర్తి, హరీష్ ఎల్‌ఈడీ టీవీని అందజేశారు. భూషి విజయకుమార్, రాణి వివాహ వార్షికోత్సవం సందర్భంగా విద్యార్థులకు పలకలు, నోట్ పుస్తకాలు, ఆట వస్తువులను గురువారం గ్రామ సర్పంచ్ గుడిపూడి రాజు, వైద్యులు గుడిపూడి చిన్నరాజు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షేక్ మున్నికి అందించారు. ఈ సందర్భంగా దాతలను సూపర్‌వైజర్ మున్ని అభినందించారు. గ్రామ పెద్దలు కామేశ్వరరావు, శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు, రిటైడ్ సూపర్‌వైజర్ చావా నిర్మల మేరి, అంగన్‌వాడీ కార్యకర్తలు కుమారి, సామ్రాజ్యం, బీవీ సామ్రాజ్యం, గౌషియా, అరుణకుమారి, వెంకటలక్ష్మి, స్రవంతి, కరిమూన్ పాల్గొన్నారు.

చిరంజీవి జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న వెంకటఅప్పారావు, అభిమానులు

సత్తెనపల్లి: సినీ నటుడు చిరంజీవి 69వ జన్మదినం సందర్భంగా అభిమానులు, జనసేన నాయకులు గురువారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. జనసేన నియోజకవర్గ సమన్వయకర్త బొర్రా వెంకట అప్పారావు ఆధ్వర్యంలో పరివర్తన ఆశ్రమ పాఠశాల, మొల్లమాంబ వృద్ధాశ్రమంలో కేక్ కట్ చేసి, చిరంజీవికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. వృద్ధులకు అన్నదానం నిర్వహించారు. కౌన్సిలర్ సుమన్, నాగేశ్వరరావు, ఆశ్రమ నిర్వాహకులు కొండలు పాల్గొన్నారు. జనసేన పార్టీ ఉమ్మడి గుంటూరు జిల్లా అధికార ప్రతినిధి తవిటి భావనారాయణ, అభిమాని శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆదరణ వృద్ధాశ్రమంలో అన్నదానం చేశారు. అభిమానులు కాశీ చైతన్య, గౌస్, సైదేశ్వరరావు, చిన్ని, నాగేశ్వరరావు, నాయుడు పాల్గొన్నారు.

పెదకూరపాడులో..

పెదకూరపాడు: సినీ నటుడు చిరంజీవి జన్మదిన వేడుకలను నియోజకవర్గ జనసేన నాయకుడు సుదా సాంబశివరావు ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక జనసేన కార్యాలయంలో కేక్ కట్ చేశారు. జనసేన నాయకుడు భాష్యం నరసయ్య మట్లాడుతూ.. సేవా కార్యక్రమాల్లో ఎప్పుడు చిరంజీవి ముందుంటారన్నారు. అనంతరం స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. జనసేన మండల కన్వీనర్ మల్లెల వెంకటచలపతిరావు, ఉపాధ్యక్షుడు వీరబ్రహ్మం, ప్రధాన కార్యదర్శి లక్ష్మీకాంత్, హనుమంత్, మధు, జిల్లా పోగ్రాం కో-ఆర్డినేటర్ శ్రీనివాసరావు, అమరావతి అధ్యక్షుడు అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

నేడు న్యాయవాదులు విధుల బహిష్కరణ

సత్తెనపల్లి: కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిపై జరిగిన అత్యాచారం, హత్యను నిరసిస్తూ శుక్రవారం న్యాయవాదులు విధులు బహిష్కరిస్తున్నట్లు సత్తెనపల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కంభాల అనిల్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కక్షిదారులు ఈ విషయాన్ని గమనించి, సహకరించాలన్నారు.

సనారీ వీరబ్రహ్మేంద్ర స్వామి ఆశ్రమంలో కన్నా పూజలు



సత్తెనపల్లి: పట్టణంలోని శ్రీసనారీ వీరబ్రహ్మేంద్ర స్వామి ఆశ్రమాన్ని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ గురువారం సందర్శించారు. ఆలయంలోని శ్రీవీరబ్రహ్మేంద్ర స్వామి, సనారీ విశ్వేశ్వర స్వామి, మల్లికార్జునస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆశ్రమ వంశపారంపర్య ధర్మకర్త, ఆశ్రమాధిపతి చింతాడ లలితాంబ మాతాజీ ఆశీర్వాదం తీసుకున్నారు. వేద పాఠశాల విద్యార్థులు పూర్ణకుంభంతో కన్నా లక్ష్మీనారాయణకు స్వాగతం పలికారు. వేద ఆశీర్వచం చేసి, స్వామి వారి శేషవస్త్రాన్ని, చిత్రపటాన్ని రత్నాచార్యులు బహూకరించారు. నిర్వాహకులు ఆశ్రమం చరిత్రను వివరించారు.

పరిశుభ్రమైన ఆహార పదార్థాలు వడ్డించాలి



ఆశ్రమంలో రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా అధికారులు

నకరికల్లు: ఆశ్రమంలో అన్నదానం చేయదలచిన వారు అక్కడే తయారుచేసిన పరిశుభ్రమైన పదార్థాలనే వడ్డించాలని జిల్లా ప్రొహిబిషన్ అధికారి బి.సత్యనారాయణ సూచించారు. మండలంలోని కొండమోడు వీరమ్మ కాలనీలోని దీనమ్మ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చిల్డ్రన్స్ హోంను గురువారం సందర్శించారు. చిల్డ్రన్స్ హోంలో కల్పిస్తున్న సదుపాయాలు పరిశీలించారు. రికార్డులు తనిఖీ చేసి, సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిల్డ్రన్స్ హోంకు ప్రభుత్వం ద్వారా 2018లో లైసెన్స్ మంజూరు చేసిందని, గడువు ముగియడంతో లైసెన్స్ పునరుద్ధరణకు మరోసారి పరిశీలించినట్లు తెలిపారు. శుభకార్యాలకు, ఫంక్షన్‌కు అన్నదానం చేయదలచిన వారు బయట వండిన ఆహారం తీసుకురావద్దన్నారు. అనకాపల్లిలో జరిగిన ఘటన నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి డి.శౌరిరాజు, డీఓఐసీ కృష్ణారెడ్డి, పీఓఎస్ఐసీ ప్రశాంత్‌కుమార్, అసిస్టెంట్ సీడీపీఓ సంతోష కుమారి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అరుణ, ఆశ్రమ నిర్వాహకులు శంకరరావు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

గోళ్ళపాడు(ముప్పాళ్ళ): ఆటోను ద్విచక్ర వాహనం ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరికి గాయాలైన ఘటన మండలంలోని గోళ్ళపాడు గ్రామంలోని ప్రధాన కూడలిలో గురువారం జరిగింది. ఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నరసరావుపేట మండలంలోని ఇసప్పాలెం గ్రామానికి చెందిన ఎస్.ఏసుపాదం, ఎం.ఐనయ్య ద్విచక్రవాహనంపై ముప్పాళ్ల నుంచి ఇసప్పాలేనికి వెళుతుండగా, గోళ్ళపాడు ప్రధాన కూడలిలో నరసరావుపేట వైపు నుంచి గ్రామంలోకి వెళుతున్న హెచ్‌పీ గ్యాస్ సిలిండర్ ఆటోను ఢీ కొట్టారు. ఈ ప్రమాదంలో ఏసుపాదం, ఐనయ్య కాళ్లకు గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం నరసరావుపేట ఏరియా వైద్యశాలకు తరలించారు.

డ్రమ్ సీడర్ విధానంతో బహుళ ప్రయోజనాలు



డ్రమ్ సీడర్‌ను పరిశీలిస్తున్న ఏడీఏ శ్రీకృష్ణదేవరాయిలు, ఏఓ దేవదాసు

నకరికల్లు: డ్రమ్ సీడర్ విధానంలో వరి సాగు చేయడం వల్ల బహుళ ప్రయోజనాలు కలుగుతాయని సహాయ వ్యవసాయ సంచాలకులు బి.శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. రూపెనగుంట్ల గ్రామంలో మేదరమెట్ల బ్రహ్మయ్య అనే రైతు 3.5 ఎకరాల్లో కేఎన్ఎం 1,638 వరిరకాన్ని డ్రమ్ సీడర్ పద్ధతిలో సాగుచేస్తుండగా గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతుతో మాట్లాడి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రమ్ సీడర్ విధానంలో 12 నుంచి 14 కేజీల విత్తనాలు మాత్రమే ఎకరాకు సరిపోతాయని తెలిపారు. పొలంలో మొక్క సాంద్రత అధికంగా వస్తుందన్నారు. సాధారణ విధానం కన్నా వారం ముందుగానే పంట కోతకు వస్తుందన్నారు. దిగుబడి కూడా 4 నుంచి 5 బస్తాలు అధికంగా ఉంటుందని వివరించారు. ఎకరాకు రూ.6 నుంచి రూ.7 వేల అధిక ఆదాయం పొందవచ్చని చెప్పారు. ఒకే రోజులో నాలుగెకరాల వరకు విత్తనాలు వేయవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు, వీఏఏ జి.జగదీష్, రైతులు పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్‌లు పంపిణీ



స్కాలర్‌షిప్‌లు అందుకున్న విద్యార్థులతో అరుణ్‌కుమార్

సత్తెనపల్లి: వెల్లంకి ఫౌండేషన్ ద్వారా ప్రతిభావంతులైన విద్యార్థులకు ఈ ఏడాది నుంచి స్కాలర్‌షిప్‌లు అందించనున్నట్లు ఫౌండేషన్ చైర్మన్ వెల్లంకి అరుణ్‌కుమార్ చెప్పారు. పట్టణంలోని సుగాలీ కాలనీ జెడ్పీ, విద్యా కేంద్రం పాఠశాలల్లో గురువారం స్కాలర్‌షిప్‌ల పంపిణీ చేశారు. ఈ ఏడాది నుంచి ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు ప్రోత్సాహం అందించేందుకు వెల్లంకి సాంబశివరావు స్మారక విద్యా వేతనాలు అందిస్తున్నామన్నారు. మొత్తం 12 మందికి రూ.1.20లక్షలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు



అమరావతి: మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల విద్యార్థులకు ప్రభుత్వ ఆదేశాల మేరకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు కంటి వైద్యాధికారి సుబ్బారావు తెలిపారు. అత్తలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గురువారం స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థులు 574 మందికి కంటి పరీక్షలు నిర్వహించామన్నారు. వారిలో 21 మందికి దృష్టి సమస్యలను గుర్తించి, కళ్లజోళ్లకు సిఫార్సు చేశామని తెలిపారు. మండలంలోని 2,357 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహిస్తామని వెల్లడించారు. పాఠశాల ప్రిన్సిపల్ రాణి ఇందిరా ప్రియదర్శిని, సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

వచ్చామా.. వెళ్లామా

- మొక్కుబడిగా మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం
- సమస్యల ప్రస్తావన లేకుండానే ముగింపు



మాట్లాడుతున్న తహసీల్దార్ ఎం.భవానిశంకర్

ముప్పాళ్ళ: మూడు నెలల కొకమారు జరిగే మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం మొక్కుబడిగానే ముగిసింది. ఎంపీపీ మారూరి పద్మ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో అధికారులు వారి శాఖల ద్వారా అందించే పథకాలు గురించే వివరిస్తూ సమావేశాన్ని కొనసాగించారు. గౌరవ సభ్యులు సమావేశ మందిరానికి రాగానే వారితో సంతకాలు చేయించుకోవడం తప్ప గ్రామాల్లో సమస్యల ప్రస్తావన గురించి చర్చించిన దాఖలాలు లేవు. మొత్తం 14 గ్రామ పంచాయతీలకు గాను 7 గ్రామాల సర్పంచ్‌లు మాత్రమే హాజరయ్యారు. 12 మంది ఎంపీటీసీలకు గాను ఏడుగురు హాజరయ్యారు. తహసీల్దార్ ఎం.భవానిశంకర్ వచ్చే నెలలో నిర్వహించే రెవెన్యూ గ్రామ సభల గురించి వివరించారు. గ్రామాల్లో నూరు శాతం ఇంటి పన్ను బకాయిలు వసూలు చేయాలని ఈఓపీఆర్డీ రూపవతి చెప్పారు. బొల్లవరం-రుద్రవరం గ్రామాల మధ్య రోడ్డు నిర్మాణం చేపట్టాలని ఎంపీటీసీ సభ్యుడు కళ్లం వీరభాస్కరరెడ్డి అధికారులను కోరారు. సమావేశంలో జెడ్పీటీసీ శిరిగిరి చంద్రకళ, ఎంపీడీఓ పి.పుట్టారెడ్డి, వైస్ ఎంపీపీ చిరుగూరి రాయన్న, కో-ఆప్షన్ సభ్యుడు అజ్గర్‌అలీ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

బోనస్ పంపిణీ

బెల్లంకొండ: వెంకటాయపాలెం గ్రామంలోని సంగం డెయిరీ పాల కేంద్రంలో పాడి రైతులకు గురువారం బోనస్ పంపిణీ చేశారు. గతేడాది ఏప్రిల్‌లో ఈ ఏడాది మార్చి వరకు 53 మంది పాల ఉత్పత్తిదారుల బట్వాడా రూ.14,28,853కు గాను వందకు 4 శాతం రూ.57,154లను బోనస్‌గా పంపిణీ చేసినట్లు గంగిరెడ్డిపాలెం సంగం డెయిరీ బ్రాంచ్ మేనేజర్ శ్రీనివాసరావు తెలిపారు. సూపపర్‌వైజర్లు సుధీర్, సాయి తేజ, పాలకేంద్రం ప్రెసిడెంట్ అంజలి బాయి, కోటేశ్వరరావు, భాస్కరరావు పాల్గొన్నారు.